సాక్షి
ఒడిశా

శనివారం । 26 । జూలై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,47,047లు, బంగారం 9గ్రాముల 200 మిల్లీగ్రాములు. వెండి 18గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ప్రైవేట్‌ బస్సుల సేవలు అభినందనీయం

-8లో

ప్రైవేట్‌ బస్సు యజమానులు కొరాపుట్‌ జిల్లా ప్రజలకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్‌ బాహిణీపతి అన్నారు.

నేడు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రద్దు

కటక్‌: రాష్ట్రంలో గత రెండు రోజులుగా పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. కటక్‌ జిల్లాకు భారీ నుంచి అతి భారీ వర్ష సూచన జారీ కావడంతో జలదిగ్బంధ పరిస్థితులు పొంచి ఉన్నట్లు అనుబంధ యంత్రాంగం భావిస్తోంది. ఈ అత్యవసర పరిస్థితుల దృష్ట్యా కటక్‌ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు శనివారం తెరిచి యథాతథంగా పని చేస్తాయి. జిల్లాలోని అన్ని వర్గాల అధికారులు, ఉద్యోగులు కార్యాలయంలో హాజరుకావాలని జిల్లా మేజిస్ట్రేట్‌ ఆదేశించారు.

న్యూస్‌రీల్‌

నలుగురు నిందితుల అరెస్టు



మాట్లాడుతున్న పోలీస్‌ అధికారి సత్యబ్రత లెంక

జయపురం: భారతమాల ప్రాజెక్టు క్యాంప్‌లో జరిగిన దొంగతనం కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు జయపురం సబ్‌ డివిజన్‌లోని బొరిగుమ్మ పోలీసు అధికారి సత్యబ్రత లెంక శుక్రవారం వెల్లడించారు. బొరిగుమ్మ పోలీసు స్టేషన్‌లో బొరిగుమ్మ పోలీసులు నిర్వహించిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఆయన వివరిస్తూ.. అరెస్టు అయిన వారు బొరిగుమ్మ ప్రాంతం మీనా హరిజన్‌, దైతేరీ ఘాసి, త్రిపతి హరిజన్‌, ఒక మైనర్‌ ఉన్నాడన్నారు. మైనర్‌ నిందితుని జేజే బోర్డులో హాజరుపరచి అనంతరం అతడిని బాల రక్షక గృహానికి పంపినట్లు అధికారి వెల్లడించారు. పోలీసు అధికారి వివరణ ప్రకారం.. బొరిగుమ్మ సమితి కమర గ్రామ ప్రాంతంలో భారత మాల ప్రాజెక్టు కంపెనీలో క్యాంప్‌ ఉంది. కార్మికులు, సూపర్‌వైజర్‌లు ఉంటున్నారు. 2024 అక్టోబర్‌ 1వ తేదీ రాత్రి 3 గంటల సమయంలో నలుగురు దుండగులు క్యాంప్‌లో ప్రవేశించారని, భయంకర వాతావరణం సృష్టించి సూపర్‌వైజర్‌తోపాటు కార్మికులను తాళ్లతో బంధించారని వెల్లడించారు. వారి వద్దగల రూ.8 వేల నగదు, బైక్‌, మూడు ఫోన్లు, రెండు కటింగ్‌ మిషన్లు దొంగిలించుకుపోయారన్నారు. ఈ సంఘటనపై సూపర్‌వైజర్‌ బొరిగుమ్మ పోలీసు స్టేషన్‌లో లిఖిత ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. దర్యాప్తు అధికారి ఏఎస్‌ఐ ద్రోణాచార్య బాగ్‌ గురువారం నలుగురు నిందితులను అరెస్టు చేశారని వెల్లడించారు. వారి నుంచి రెండు ఫోన్లు స్వాధీనపరచుకున్నట్లు ఎస్‌డీపీఓ తెలిపారు. బొరిగుమ్మ పోలీసు అధికారి పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం



కొండచిలువను చూపుతున్న సబ్‌ కలెక్టర్‌ జెన్నా, సిబ్బంది

రాయగడ: స్థానిక సబ్‌ కలెక్టర్‌ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం సుమారు 12 అడుగుల కొండచిలువ కలకలం సృష్టించింది. కార్యాలయం ముందు నుంచి కొండచిలువ వెళ్తుండగా సిబ్బంది చూసి వెంటనే స్నేక్‌ స్నాచర్‌ ప్రమోద్‌ సేనాపతికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సేనాపతి.. అర గంట వ్యవధిలో పామును పట్టుకున్నారు. పామును చూసేందుకు సిబ్బందితో పాటు సబ్‌ కలెక్టర్‌ రమేష్‌ చంద్ర జెన్నా కూడా వచ్చారు. పామును స్నేక్‌ స్నాచర్‌ సమీపంలో గల అడవుల్లో విడిచిపెట్టాడు.

విజిలెన్స్‌ వలలో డిప్యూటీ రేంజర్‌



విజిలెన్స్‌ వలలో పడిన డిప్యూటీ రేంజర్‌ రామచంద్ర నేపక్‌

సోంబారుతోటలో నేపక్‌ నివాస భవనం

- పట్టుబడిన రూ. 2.44 కోట్ల నగదు, విలువైన బంగారు ఆభరణాలు
- విలువైన భవనాలు ఉన్నట్టు గుర్తింపు



నిందితుడు నేపక్‌ని గట్టిగా పట్టుకున్న విజిలెన్స్‌ అధికారి

జయపురం: కొరాపుట్‌ జిల్లా జయపురం అటవీ శాఖ డిప్యూటీ రేంజర్‌ రామ చంద్ర నేపక్‌ విజిలెన్స్‌ వలలో పడ్డారు. పట్టణం సోంబారు తోట వీధిలోని అతని భవనంలో, ప్రసాదరావుపేటలోని ఇంటిపైన బిజిలెన్స్‌ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అతనికి సోంబారుతోటతోపాటు ప్రసాదరావుపేటలో ఇల్లు, ఎన్‌కేటీవో రోడ్డులో ఒక ఇల్లు, మరో అపార్ట్‌మెంట్‌, భువనేశ్వర్‌లో మరో భవనం, జయపురం ప్రాంతంలో 26 ఎకరాల పంట భూమి ఉన్నట్లు ఇంతవరకు ఆధారాలు లభించినట్లు కొరాపుట్‌ ప్రాంతీయ బిజిలెన్స్‌ ఎస్పీ నరేంద్రకుమార్‌ పాఢీ సూచనప్రాయంగా వెల్లడించారు. ఇంకా మరి కొన్ని ప్రాంతాలోని అతని ఆస్తులపై జయపురం విజిలెన్స్‌ విభాగ అధికారులు దాడులు కొనసాగిస్తున్నట్టు వెల్లడించారు.



ఇంటిలో లభించిన బంగారం



పట్టుబడిన నగదు

ఇంతవరకు రెండు కోట్ల 44 లక్షల రూపాయల నగదు, 500 గ్రాముల బంగారు నగలు, రెండ కేజీల వెండి, వాటితో పాటు మరికొని విలువైన బంగారు నగలు సీజ్‌ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

యువతి అనుమానాస్పద మృతి



అనుపమ నాయక్‌ (ఫైల్‌)

రాయగడ: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో గల చంద్రశేఖర్‌పూర్‌ పోలీసులు చంద్రశేఖర్‌పూర్‌ సమీపంలో గల ఒక అద్దె ఇంటిలో ఒక యువతి మృతదేహాన్ని గురువారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న యువతి మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టంకు తరలించారు. మృతురాలిని జిల్లాలోని కాశీపూర్‌ సమితి గొరఖ్‌పూర్‌ ప్రాంతానికి చెందిన అనుపమ నాయక్‌ (24)గా పోలీసులు గుర్తించారు. అనంతరం మృతురాలి కుటుంబానికి పోలీసులు సమాచారం తెలిపారు. సమాచారం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం తన కూతురు ఆత్మహత్య వెనుక ఏదో బలమైన కారణం ఉంటుందని దీనిపై దర్యాప్తు చేయాలని మృతురాలి తండ్రి జొయల్‌ నాయక్‌ చంద్రశేఖర్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దివ్యాంగురాలైన తన కూతురు చదువుకునేందుకు చంద్రశేఖర్‌పూర్‌ ప్రాంతంలో ఒక అద్దె ఇంటిలో ఉంటోంది. నాలుగు నెలలుగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తి తన కుమార్తెను బెదిరిస్తున్నాడని, ఈ సంగతిని ఆమె ఫోన్‌లో చెప్పిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కూతురిని హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

ఎఫ్‌టీఏలో ఉనికి కోల్పోయిన ఒడిశా



ఎఫ్‌టీఏలో చోటు దక్కించుకున్న ఉత్పాదనలు

భువనేశ్వర్‌: యునైటెడ్‌ కింగ్‌డమ్‌తో భారత దేశం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుతుర్చుకుంది. ఈ ఏడాది జూలై 24న ఈ చారిత్రాత్మక ఒప్పంద పత్రాలపై ఇరు దేశాల ప్రముఖుల సమక్షంలో ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం వ్యవసాయ ఉత్పాదనలు, వస్త్రాలు, క్రీడా సామగ్రి, నగలు, ఆభరణాలు, బొమ్మలు, పింగాణి, తోలు, పాదరక్షలు, రబ్బరు వంటి ఉత్పాదనల క్రయవిక్రయాలకు మార్గం సుగమమైంది.

దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ప్రముఖ, పేరొందిన ప్రాంతీయ ఉత్పాదనలు యునైటెడ్‌ కింగ్‌డమ్‌కు ఎగుమతి అవుతాయి. ఈ జాబితాలో ఒడిశాకు స్థానం లభించక పోవడం దురదృష్టకరం. రాష్ట్రంలో 25 పైబడి భౌగోళిక సూచిక (జీఐ) గుర్తింపు పొందిన ఉత్పత్తులు పేరొందాయి. ఈ జాబితాలో కంధమల్‌ పసుపు నుంచి ప్రత్యేకమైన వస్త్రాలు, హస్తకళల వరకు, కంధమాల్‌ హల్ది, సంబల్‌పురి చీర, రఘురాజ్‌పూర్‌ విభిన్న కళాకృతులు (పాట్టా చిత్రాలు), కటక్‌ వెండి తీగల అల్లిక సామగ్రి తదితర పలు ఉత్పాదనలు ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కటీ యూకేతో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) జాబితాలో చోటు చేసుకోలేదు. ఆంధ్ర ప్రదేశ్‌ నుంచి అరకు కాఫీ ఈ ఒప్పందంలో చోటు చేసుకుంది. వాస్తవానికి అరకు వ్యాలీ అరబిక కాఫీగా ఉభయ ఆంధ్ర ప్రదేశ్‌, ఒడిశాకు సంయుక్తంగా భౌగోళిక సూచిక (జీఐ) గుర్తింపు మంజూరైంది. ఎఫ్‌టీఏ ఒప్పందం జాబితాలో ఈ ఉత్పాదనని ఆంధ్రప్రదేశ్‌కు పరిమితం చేసి స్థానం కల్పించడం చర్చనీయాంశమైంది. రాష్ట్రం నుంచి 20 మంది భారతీయ జనతా పార్టీ పార్లమెంటు సభ్యులు, ఇద్దరు కేంద్ర మంత్రులతో రాష్ట్ర మహిళ భారత రాష్ట్రపతిగా ఉన్నారు. భారత ప్రభుత్వంలో రాష్ట్రానికి ఘనమైన బలం ఉన్న రాష్ట్రంలో స్వదేశీ ఉత్పత్తుల రంగంలో రాష్ట్ర ప్రజా ప్రతినిధులు అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రం ఉనికిని పరిరక్షించడంలో తమ సమర్థతని ప్రదర్శించడంలో విఫలమైనట్లు విమర్శలు పుంజుకుంటున్నాయి.

2.63 యూఎస్‌ బిలియన్‌ డాలర్లు టర్నోవరుతో ఒడిశా యూఏఈ యొక్క 8వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగుతుంది. ఈ పరిస్థితులు యునైటెడ్‌ కింగ్‌డమ్‌తో ఒప్పందం సందర్భంగా పరిగణనలోకి తీసుకోకపోవడం తాజా అంతర్జాతీయ వాణిజ్య రంగంలో రాష్ట్రం ఉనికి కనుమరుగైపోయింది. ఈ పరిస్థితిని సవరించే దిశలో ఉభయ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాల్సి ఉంది. ఒడిశా ఇటీవల మామిడి, బొప్పాయి, పసుపు వంటి ఆహార ఉత్పాదనల్ని యునైటెడ్‌ కింగ్‌డమ్‌కి ఎగుమతి చేయడం ప్రారంభించింది. దీని విస్తరణ పట్ల ప్రత్యేకంగా శ్రద్ధ వహించాల్సి ఉంది. రాష్ట్రంలో వివిధ రకాల ఆహార, వస్త్ర తదితర దైనందిన జీవ ఉత్పాదనలు పుష్కలంగా ఉన్నాయి. వాటి ప్రపంచ వ్యాప్త ప్రోత్సాహానికి సరైన ప్రాతినిధ్యం లేదని తాజా ఎఫ్‌టీఏ ఒప్పందం స్పష్టం చేసింది. సంస్థాగత మద్దతుతో వ్యవసాయ ఉత్పాదన ఎగుమతి సంస్థలతో అనుసంధానం అంతర్జాతీయ వాణిజ్య రంగంలో ఉనికి బలపడుతుంది.

మొక్కల పంపిణీ



ప్రజలకు మొక్కలను అందజేస్తున్న సుబ్రత పండ తదితరులు



ఉత్సాహంతో మొక్కలు తీసుకెళ్తున్న బాలుడు



మొక్కలు పంపిణీ చేస్తున్న డాక్టర్‌ నొరంజన్‌ మిశ్ర తదితరులు

జయపురం: జయపురం సమితి బలియ గ్రామం పంచాయితీలో గురువారం జయపురం శారదా విహార్‌ ప్రాంత వికాశ సంకల్ప ఫౌండేన్‌, కేశవ సేవా ట్రస్టులు సంయుక్తంగా వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా బలియ పంచాయతీ కుంతరకాల్‌ గ్రామంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామస్తుల్లో ఒక్కక్కరికీ రెండు మొక్కలు చొప్పున పంపిణీ చేసి వాటిని పెంచే బాధ్యతను తెలియజేశారు. మొక్కల పెంపకం జన జీవనానికి, పర్యావరణానికి ఎంతో ఉపయోగకరమని వివరించారు. వందలాది ఔషధ మొక్కలతో పాటు మునగ, బొప్పాయి, జామి, జీడి మామిడి మొక్కలను అందజేశారు. గ్రామీణులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు స్వీకరించారు. నిర్వాహకులు గ్రామీణులకు మొక్కలతో పాటు ఎరువులు అందజేశారు. ప్రతి గ్రామ వాసి కాయకూరలు, పండ్ల తోటలు పెంచి ప్రతి దినం ఆర్థికంగా లబ్ధి పొందాలని అందుకు తమ సంస్థలు సహకరిస్తాయని గ్రామస్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో కేశవ సేవా ట్రస్ట్‌, వికాశ సంకల్ప ఫౌండేషన్‌ నిర్వాహకులు డాక్టర్‌ నిరంజన్‌ మిశ్ర, నిరాకర చౌదరి, డొంబురు పాణిగ్రహి, పార్థసారధి, సుబ్రత పండ పాల్గొన్నారు.

వంతెనపై వరద నీరు



కాన్యాశ్రమం ప్రాంతంలో ఉన్న వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కలిమెల, పోడియా సమితుల మధ్య ఉన్న కన్యాశ్రమం వద్ద గల వంతెన నీట మునిగింది. మల్కన్‌గిరి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గురువారం రాత్రి కురిసిన వర్షానికి వంతెన పై శుక్రవారం ఉదయానికి 2 అడుగుల వరద నీరు చేరింది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఉదయం 9 గంటల నుంచి నీటి ప్రవాహం పెరుగుతూనే ఉంది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై అయి మల్కన్‌గిరి నుంచి కలిమెల, ఎంవీ 79, మోటు వైపు నుంచి వెళ్లే వాహనాల రాకపోకలు నిలిపివేశారు. పాడియా సమితికి పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి.

వాన కొనసాగితే శనివారానికి పోట్టేర్‌, ఎంవీ 90 గ్రామం, కంగుర్‌కొండ, ఎంవీ 96 గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న వంతెనలు కూడా నీట మునిగే అవకాశం ఉంది.

ప్రజల చెంతకు సహకార సేవలు



సమావేశంలో పాల్గొన్న అధ్యక్షుడు ఈశ్వర చంద్ర పాణిగ్రాహి తదితరులు

జయపురం: కొరాపుట్‌ కేంద్ర సహకార బ్యాంక్‌ డైరెక్టర్ల సమావేశం శుక్రవారం జరిగింది. కెసీసీ బ్యాంక్‌ అధ్యక్షుడు ఈశ్వర చంద్ర పాణిగ్రహి అధ్యక్షతన జయపురంలోని బ్యాంక్‌ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో బ్యాంక్‌ అమలు చేస్తున్న కార్యకలాపాలు.. వాటి ఫలితాలపై చర్చించారు. బ్యాంక్‌ సర్వాంగ ఉన్నతికి చేపట్టవలసి పనులపై మాట్లాడారు. అలాగే బ్యాంక్‌ చేపడుతున్న ప్రజాహిత పథకాలు ఖాతాదారుల చెంతకు చేర్చి వారికి లబ్ధి చేకూరేలా చూడాలని నిర్ణయించారు. సమావేశంలో బ్యాంక్‌ సీనియర్‌ డైరెక్టర్‌ రమాకాంత రౌళో, భీమసేన్‌ సాహు, కార్యదర్శి అతుల్య కుమార్‌ మల్లిక్‌, బ్యాంక్‌ అసిస్టెంట్‌ జనరల్‌ మేనేజర్‌ హరిశ్చంద్ర బనాగడతో పాటు పలువురు డైరెక్టర్లు, బ్యాంక్‌ పరిశీలన కమిటీ సభ్యులు, బ్యాంక్‌ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గజపతి కలెక్టర్‌ బిజయకుమార్‌ దాస్‌కు ఘనంగా వీడ్కోలు



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న కలెక్టర్‌ బిజయ కుమార్‌ దాస్‌



వీడ్కోలుసభలో ప్రభుత్వ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ బిజయకుమార్‌ దాస్‌

పర్లాకిమిడి: గజపతి జిల్లా కలెక్టర్‌ బిజయ కుమార్‌ దాస్‌ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అదనపు శాసన కార్యదర్శిగా భువనేశ్వర్‌కు పదోన్నతిపై బదిలీ అవ్వడంతో ప్రభుత్వ ఉన్నత అధికారులు, కలెక్టరేట్‌, రెవెన్యూ, జిల్లా పరిషత్‌ సిబ్బంది వీడ్కోలు సభను ఆర్‌శెట్టి భవనంలో శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్‌ను ప్రభుత్వ అధికారులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ వీడ్కోలు సభకు అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌ ఫాల్గుణీ మఝి అధ్యక్షత వహించారు. కలెక్టర్‌ బిజయ కుమార్‌ దాస్‌ గజపతి జిల్లాలో 11 నెలల 15 రోజులు పనిచేశారు. ఆయన ఒక మిత భాషి అని, మంచి పరిపాలన దక్షుడిగా పేరు తెచ్చుకున్నారని ఎస్పీ జ్యోతింద్ర కుమార్‌ పండా అన్నారు. ఆయన 11 నెలల పరిపాలనలో అందరు అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయడమే కాకుండా జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు అమలు జరిగాయని అన్నారు.

జవాబుదారీతనం తప్పనిసరి

- ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్‌ ఆహుజా
- రాష్ట్ర స్థాయి బాలల రక్షణ, సంక్షేమ పర్యవేక్షణపై సమీక్ష



ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి అధ్యక్షతన సమీక్ష సమావేశం

భువనేశ్వర్‌: బాలల సంరక్షణ సంస్థలు నిబద్ధత, జవాబుదారీతనంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్‌ ఆహుజా ఆదేశించారు. ఆయన అధ్యక్షతన స్థానిక లోక్‌ సేవా భవన్‌లో రాష్ట్ర స్థాయి బాలల రక్షణ, సంక్షేమ పర్యవేక్షణ సమీక్ష కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో బాలల రక్షణ, సంరక్షణ కార్యకలాపాల్లో సంస్థాగత, సంస్థేతర వర్గాల పని తీరుని సమీక్షించారు. బాలల సంరక్షణ సంస్థలలో నిర్వహించే యోగా సెషన్లపై వివరణాత్మక చర్చ జరిగింది.

ప్రస్తుతం 41 బాలల సహాయ యూనిట్లు, హెల్ప్‌ డెస్కులు, రాష్ట్ర కంట్రోల్‌ రూమ్‌ పిల్లలకు మద్దతు అందించడానికి సమర్థంగా పనిచేస్తున్నట్లు అధికారులు వివరించారు. భారత ప్రభుత్వం చేపట్టిన మిషన్‌ వాత్సల్యను రాష్ట్రంలో సమర్థంగా అమలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రంలో బాలల రక్షణ కోసం రాష్ట్ర, జిల్లా, గ్రామ పంచాయతీ స్థాయిలలో మూడు అంచెల బాలల సంక్షేమం, రక్షణ కమిటీలు రాష్ట్రంలో చురుగ్గా పని చేస్తున్నాయని మహిళా, శిశు అభివృద్ధి డైరెక్టర్‌ మోనిషా బెనర్జీ తెలిపారు. దాదాపు 8,150 మంది పిల్లలు సంస్థాగత సంరక్షణలో ఉండగా, 6,317 మంది పిల్లలు సంస్థాగతేతర సంరక్షణలో ఉన్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో గత మూడేళ్లుగా దత్తత అభివృద్ధి స్థిరంగా కొనసాగుతుంది. ప్రతి సంవత్సరం బాలుర కంటే బాలికలను దత్తత తీసుకోవడం పెరుగుతుంది. రాష్ట్రంలో 160 బాలల గృహాలు, 33 ప్రత్యేక దత్తత సంస్థలు, 12 ఓపెన్‌ షెల్టర్లు, 7 పరిశీలన గృహాలు మరియు 7 ప్రత్యేక గృహాలు పని చేస్తున్నాయి. చైల్డ్‌ కేర్‌ సంస్థలలోని 8,150 మంది పిల్లలలో 98 శాతం మంది ఆధార్‌ కోసం నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం, 672 మంది పిల్లలు వృత్తి విద్యను అభ్యసిస్తున్నారు. 8,130 మంది వ్యక్తులు 264 వేర్వేరు కార్యక్రమాల ద్వారా శిక్షణ పొందారు. 211 మంది పిల్లలు ఉపాధి పొందగా, 79 మంది స్వయం ఉపాధి పొందారు. సంస్థాగత సంరక్షణ నుంచి బయటకు వచ్చిన పిల్లలకు వివాహ సహాయం అందిస్తున్నారు. అర్హులైన పిల్లలకు ఆశీర్వాద్‌ యోజన కింద ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఇప్పటివరకు, 51,000 మందికి పైగా పిల్లలు ఆశీర్వాద్‌ యోజన పరిధిలోకి వచ్చారు. వీరంతా వివిధ ప్రయోజనాలు, సహాయం పొందుతున్నారు. సత్వర పిల్లల రక్షణ సహాయం కోసం చైల్డ్‌ హెల్ప్‌లైన్‌ 1098, మహిళా హెల్ప్‌లైన్‌ 181 మరియు అత్యవసర ప్రతిస్పందన మద్దతు వ్యవస్థ 112 లను అనుసంధానించినట్లు వివరించారు. యశోద పథకం కింద ప్రతి నాలుగేళ్లకు ఒకసారి అనాథ సర్వేలు నిర్వహణ కొనసాగుతుంది. అన్ని వర్గాల పిల్లల సంరక్షణ, రక్షణ సమాచారం వివరాలు డిజిటల్‌గా నవీకరించడానికి అమొరి శిశు పోర్టల్‌ పని చేస్తుంది.

వివిధ విభాగాల కార్యదర్శులు, సీనియర్‌ అధికారులను వారి జిల్లా పర్యటనల సమయంలో పాఠశాలలు, పిల్లల సంరక్షణ సంస్థలను సందర్శించాలని రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి, అభివృద్ధి కమిషనర్‌ అనూ గర్గ్‌ సూచించారు. సమీక్ష సమావేశంలో పలు శాఖల ప్రిన్సిపల్‌ కార్యదర్శులు, కమిషనర్‌ కమ్‌ కార్యదర్శులు, వివిధ విభాగాల సీనియర్‌ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒడిశా మహిళా కూలీ దుర్మరణం

కశింకోట: రోడ్డు ప్రమాదంలో ఒడిశా మహిళా కూలీ (54) దుర్మరణం చెందింది. అనకాపల్లి జిల్లా కశింకోట వద్ద శుక్రవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సీఐ అల్లు స్వామినాయుడు వివరాల ప్రకారం.. ఒడిశాలోని జైపూర్‌కు చెందిన కళావతి కొంతకాలంగా స్థానిక ఇటుకల బట్టీల్లో పని చేస్తోంది. ఈ క్రమంలో కశింకోట కూడలి వద్ద జాతీయ రహదారి దాటుతున్న ఆమెను బొలేరో వ్యాన్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఇటుకల బట్టీ యజమాని ఇదగల మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన పూరీ కలెక్టర్



దివ్య జ్యోతి పరిడా పూరీ జిల్లా కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం ఉదయం శ్రీ మందిరం సందర్శించి రత్న వేదికపై కొలువుదీరిన చతుర్ధామూర్తుల్ని దర్శించుకుని ఆయన కార్యాలయంలో ప్రవేశించి బాధ్యతలు చేపట్టారు.

– భువనేశ్వర్/పూరీ

కలెక్టర్ పట్వారికి ఘనవీడ్కోలు



పట్వారికి జ్ఞాపికను అందజేస్తున్న ఏడీఎం కుహరో, సబ్ కలెక్టర్ రమేష్

రాయగడ: జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారికి బదిలీ కావడంతో జిల్లా యంత్రాంగం ఆమెకు శుక్రవారం స్థానిక కలక్టర్ సమావేశం హాల్‌లో ఘనంగా వీడ్కోలు పలికారు. ఏడీఎం నిహారి రంజన్ కుహోరో ఆధ్వర్యంలో ఈ మేరకు నిర్వహించిన వీడ్కోలు సభలో ఆమె జిల్లాకు చేసిన సేవలను సిబ్బంది కొనియాడారు. అనంతరం దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను అందించారు. అనంతరం కలక్టర్ పట్వారి కార్యాలయం సిబ్బందితో గ్రూపుఫొటో దిగారు. తన విధుల్లో భాగంగా సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఆదివాసీ, హరిజన ప్రాంతమైన ఈ జిల్లాలో కలెక్టర్‌గా తాను సేవలు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న, ఐటీడీఏ పీఎం చంద్రకాంత్ మాఝి తదితరులు పాల్గొన్నారు.

జీడి రైతుకు సత్కారం

కాశీబుగ్గ: వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్టు (ఓడీఓపీ) కార్యక్రమానికి జిల్లా పలాస జీడిపప్పు ఎంపికైన సందర్భంగా.. పారిశ్రామిక వేత్తలతో పాటు వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి గ్రామానికి చెందిన రైతు యంపల్లి నారాయణను సత్కరించారు. ఆలిండియా కాష్యూ అసోసియేషన్ చెన్నై మహాబలిపురంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు రైతు వెళ్లారు. పలాస పరిసర ప్రాంతంలో ఉద్దానంలో రైతులు పండించిన జీడి పంట కారణంగా పేరుప్రఖ్యాతలు వచ్చాయని ఏపీసీఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లా కాంతారావు తెలిపారు.

అబ్బాయిపేటలో చోరీ

జలుమూరు: జోనంకి పంచాయతీ అబ్బాయిపేటకు చెందిన ఉప్పాడ నరసమ్మ ఇంటిలో దొంగతనం జరిగింది. చోరీలో రూ.60వేల విలువైన బంగారం పోయినట్లు ఆమె తెలిపారు. పది రోజుల కిందట ఆమె హరిదాసుపురంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరిగి వచ్చి చూసే సరికి బీరువా తెరిచి ఉంది. అందులో బంగారంతో పాటు కొన్ని వస్తువులు కనిపించలేదు.

ప్రభుత్వ ఉద్యోగులు చేనేత దుస్తులు ధరించాలి



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

- ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు వారంలో ఏదో ఒక్కరోజు చేనేత వస్త్రాలు ధరించాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి విజ్ఞప్తి చేశారు. స్థానిక లోక్ సేవా భవన్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం తొలి ఒడిశా టెక్స్‌టైల్ సమ్మేళనం ప్రారంభోత్సవం పురస్కరించుకుని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఇది తూర్పు భారతదేశంలోనే అతిపెద్ద వస్త్ర సమ్మేళనంమని అభివర్ణించారు. ఈ సందర్భంగా జగత్‌సింగ్‌పూర్, భద్రక్‌లో 2 జౌళి, పాదరక్షల పార్కులను ముఖ్యమంత్రి ప్రజలకు అంకితం చేశారు. ఈ సమ్మేళనంలో సమగ్రంగా 33 అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదిరాయి. దీంతో రూ.7808 కోట్ల పెట్టుబడి హామీ లభించింది. ఒప్పందం ప్రకారం రాష్ట్రంలో 53,300 ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఏటా క్రమం తప్పకుండా ఒడిశా టెక్స్‌టైల్ సమ్మేళనాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు.



ముఖ్యమంత్రి సమక్షంలో పెట్టుబడులపై అవగాహన ఒప్పందం

వస్త్ర పరిశ్రమలో పని చేసే వారి మజూరు నెలకు రూ.1,000 పెంచడంతో ఇక నుంచి మహిళా ఉద్యోగులకు రూ.6,000 బదులుగా నెలకు రూ.7,000, పురుష ఉద్యోగులకు రూ. 5,000 బదులుగా నెలకు రూ.6,000 చెల్లిస్తారు.

ఒడిశా పెట్టుబడిదారులకు ప్రధాన ఆకర్షణగా మారింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశంలోని సమగ్ర దేశీయ పెట్టుబడులలో 40 శాతం ఒడిశాకు రావడం గర్వకారణం. పారిశ్రామిక వర్గాలు ప్రభుత్వం పట్ల కూడగట్టుకున్న నమ్మకాన్ని పదిలపరచుకోవడానికి నిబద్ధతతో కృషి చేస్తున్నట్లు వివరించారు.

ఒడిశా వస్త్ర పరిశ్రమ పురాతనమైనది. వస్త్రాలు, వస్త్ర ధారణతో మన సంస్కృతి, సంప్రదాయంతో ముడిపడి ఉన్నాయి. దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన పశ్చిమ ఒడిశా సంబల్‌పురి, బరంపురం పట్టు తదితర జౌళి ఉత్పాదనలు తార్కాణంగా పేర్కొన్నారు. వీటిని ప్రోత్సహించి ఒడిశాను వస్త్ర హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్రంలో వస్త్ర రంగంలో 5 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించి రానున్న దశాబ్దంలో 5 వస్త్ర, దుస్తులు పార్కులను అభివృద్ధి చేయడం ప్రభుత్వ యోచన అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ముడి పదార్థాల లభ్యత, ఓడ రేవుల అనుసంధానంతో సహాయక కార్యశైలి ఒడిశా వస్త్ర , దుస్తుల పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానాలలో ఒకటిగా మారిందని రాష్ట్ర చేనేత, జౌళి, హస్తకళల మంత్రి ప్రదీప్ బాల సామంత అన్నారు. రాష్ట్ర చేనేత వారసత్వాన్ని బలోపేతం చేసే దిశలో ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తుందన్నారు.

ప్రైవేట్ బస్సుల సేవలు అభినందనీయం

జయపురం: ప్రైవేట్ బస్సు యజమానులు కొరాపుట్ జిల్లా ప్రజలకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి అన్నారు. జిల్లాలో బస్సు సౌకర్యాలు అంతగాలేని గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని బస్సులు వేసి ప్రజలకు సముచిత సేవలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జయపురంలోని ఓ కల్యాణ మండపం ప్రాంగణంలో నిర్వహించిన జయపురం ప్రైవేట్ బస్సు యజమానుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జయపురం ప్రైవేట్ బస్సుల యజమానులతోపాటు జయపురం మీదుగా ఇతర ప్రాంతాలకు నడిచే ప్రైవేటు బస్సు యజమానులు అనేక మంది పాల్గొన్నారు. ఎన్నో ఏళ్ల తరువాత జరిగిన ప్రైవేట్ బస్సు యజమానుల ఆత్మీయ సమావేశంలో బస్సు యజమాన సంఘ సలహాదారు బస్సు యజమాని బసంత కుమార్ బిశ్వాల్, రామ చంద్ర పాడీ, న్యాయ సలహాదారు, న్యాయవాది సుశాంత అధికారి, జయపురం బస్సు యజమానుల సంఘ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పాత్రో, కార్యదర్శి నరేంద్ర కుమార్ మహంతి, బరంపురం ప్రైవేట్ బస్సు యజమానుల ప్రతినిధి టుటుభాయి పాల్గొన్నారు. కార్యదర్శి నరేంద్ర కుమార్ మహంతి మాట్లాడుతూ.. కొరాపుట్ ప్రజలకు సముచిత బస్సు సౌకర్యాలు కలిపించటమే తమ లక్ష్యం అన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం తాము ప్రైవేట్ బస్టాండ్‌లో ఒక టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.



సమావేశాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాహినీపతి

బాలికను పరామర్శించిన బీజేడీ నేతలు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా బిజాఘటీ వద్ద మైనర్ బాలికపై సామూహిక లైంగిక దాడి జరిగిన సంగతి తెలిసిందే. దీనిపై బీజేడీ నిజ నిర్ధారణ కమిటీ శుక్రవారం మల్కన్‌గిరిలో బాలిక ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం మాజీ ఎంపీ రమేష్ మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. బాలిక ఆరోగ్య పరిస్థితి గురించి జిల్లా వైద్యాధికారి బోజబంద్ దాస్‌ను అడిగి తెలుసుకున్నారు.



మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రి వద్ద బీజేడీ నేతలు

ఒడిశా మెట్రో ప్రాజెక్ట్‌పై అనిశ్చితి

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రతిపాదించిన భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టు సంకల్పం ఆరంభ శూరత్వంగా పరిణమించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రతిపాదన అందలేదని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రి తోఖాన్ సాహు పార్లమెంట్‌లో వెల్లడించారు. దేశంలో పలు ప్రాంతాల నుంచి కేంద్రానికి చేరిన 17 ప్రతిపాదనల్లో చాలా ప్రాజెక్టుల పట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని వివరించారు. పార్లమెంటులో కేంద్ర మంత్రి తాజా ప్రకటనతో రాష్ట్రంలో మెట్రో రైలు ప్రాజెక్ట్‌పై అనిశ్చితి అలముకుంది. ఈ పరిస్థితిపై రాష్ట్ర పట్టణాభివృద్ధి మంత్రి కృష్ణ చంద్ర మహాపాత్రో స్పందించారు. రాష్ట్రంలో భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టు చర్చల్లో ఉంది. ఈ ప్రాజెక్టు కార్యాచరణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఈ వ్యవహారాల్ని పర్యవేక్షిస్తుంది. త్వరలో కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. ఈ కార్యకలాపాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం అమలు చేసిన మునుపటి నమూనాకు భిన్నంగా ఈ ప్రాజెక్టుకు రూపురేఖలు దిద్దుతున్నట్లు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

మెళియాపుట్టి: స్థానిక సచివాలయ ఉద్యోగులు చేసిన తప్పిదానికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మూగి భాస్కరరావు, కృష్ణవేణిల ఇద్దరు కుమారులు మూగి మోక్షిత్, మూగి షారుఖ్‌లు సచివాలయ ఉద్యోగుల తప్పిదం కారణంగా తల్లికి వందనం పథకానికి అనర్హులయ్యారు. హౌస్ హోల్డ్ సర్వేలో అధికారులు వారిద్దరూ చనిపోయినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో వారికి నగదు అందలేదు. దీనిపై తల్లిదండ్రులు జేసీకి ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశానుసారం వెల్ఫేర్ అసిస్టెంట్, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

రణస్థలం: రణస్థలంలోని ఓ ఇంటికి స్లాబ్ ఇనుప రాడ్లు కడుతున్న సమయంలో విద్యుత్ తీగలు తగలడంతో కె.గోవిందరావు(48) అనే వ్యక్తి మృతి చెందాడు. జేఆర్ పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని జోగిరాజుపేట గ్రామానికి చెందిన గోవిందరావు స్లాబ్ పనికి రాడ్లు కట్టేందుకు శుక్రవారం ఉదయం 8.15 గంటలకు రణస్థలం వచ్చారు. స్లాబ్‌పై పని చేస్తున్న సమయంలో విద్యుత్ తీగలు తగలడంతో చలనం లేకుండా పడిపోయారు. తోటి కా ర్మికులు గుర్తించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉద్దానం గోపినాథపురానికి చెందిన దున్న హేమారా వు, మరో మహిళ కు తీవ్ర గాయాలయ్యాయి. పూండి నుంచి పలాస వైపు పాఠశాలలకు చెందిన పుస్తకాల లోడుతో వెళుతున్న శ్రీకాకుళానికి చెందిన వ్యాన్ పలాస నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న హేమారావును బలంగా ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్రవాహనం ధ్వంసం కాగా వెనుక ఉన్న మహిళకు తీవ్ర గాయాలై కాలు విరిగిపోయింది. వాహనం నడుపుతున్న హేమరావుకు తలకు, ఇతర చోట్ల బలమైన గాయాలయ్యాయి. స్థానికులు అక్కడకు చేరుకుని 108 వాహనానికి సమాచారం అందించి హుటాహుటిన పలాస ప్రభు త్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను శ్రీకాకుళం తీసుకెళ్లా రు. వజ్రపుకొత్తూరు పోలీసులు సమాచారం అందడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు.

సినిమాకు వెళ్లి వస్తుండగా..

కవిటి: సోంపేటలో 'హరిహర వీరమల్లు' సినిమా చూసి తిరిగి వస్తుండగా ముగ్గురు యువకులు రో డ్డు ప్రమాదానికి గురై గాయపడ్డారు. కవిటి మండలంలోని బొరివంక వద్ద గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి శుక్రవారం కేసు నమో దు చేసినట్టు ఎస్ఐ వి.రవివర్మ విలేకరులకు తెలిపా రు. కవిటి మండలం కపాసుకుద్దికి చెందిన కర్రి మేఘనాథం, కర్రి జోగారావు, వంక రాజులు గురు వా రం సినిమా చూద్దామని ముగ్గురూ ఒకే బైక్‌పై సోంపేట వెళ్లారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



పర్లాకిమిడి: వాసవీ కన్యకాపరమేశ్వరీ మందిరంలో..



పర్లాకిమిడి: పోడుగు కోవెలలో పార్వతీదేవి మందిరంలో శ్రావణ శుక్రవారం పూజలు

పర్లాకిమిడి: పట్టణంలో తొలి శ్రావణ శుక్రవారం పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉమారామలింగేశ్వర మందిరంలో పార్వతీదేవి మందిరంలో భక్తులు కుంకుమపూజలు చేశారు. ముత్తయిదువలకు పసుపు, కుంకుమ పెట్టి, దక్షిణ తాంబూలాలు అందించారు. లలితా దేవి అమ్మవారి వద్ద భక్తులు పండ్లు, పువ్వులతో పూజించారు. కొత్త బస్టాండ్ వద్ద వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో తొలి శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక కుంకుమపూజలను అర్చకులు వనమాలి మణిశర్మ మహిళలతో నిర్వహించారు.

రాయగడలో..

రాయగడ: శ్రావణ మాసం మొదటి శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బాలాజీనగర్‌లో గల వేంకటేశ్వర కళ్యాణ మండపంలో లక్ష కుంకుమ పూజలు చేశారు. కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో కుంకుమ పూజలు జరిగాయి. శ్రావణ మాసం విశిష్టతను ఈ సందర్భంగా భాస్కరాచార్యులు భక్తులకు వివరించారు. అత్యంత పవిత్రమైన ఈ నెలలో స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే సకల సౌఖ్యాలు కలుగుతాయని వివరించారు.



రాయగడ: శ్రావణ శుక్రవారం విశిష్టతను వివరిస్తున్న భాస్కరాచార్యులు, పక్కనే రాంజీ ఆచార్యులు



పర్లాకిమిడి: శాంకరీదేవి రూపంలో లలితాదేవి



పర్లాకిమిడి: పోడుగు కోవెలలోని పార్వతీదేవి మందిరంలో కుంకుమ పూజల కోసం క్యూ కట్టిన మహిళలు



రాయగడ: కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

కవితల పోటీల్లో అ'ద్వితీయ' ప్రతిభ

పర్లాకిమిడి: ఒడిశా సాహిత్య అకాడమీ తరఫున నిర్వహించిన కవితల పోటీలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్న స్థానిక గాంధీ మెమోరియల్ ప్రాథమిక ఉన్నత విద్యాలయంలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని జాస్మిన్ బోరాడో.. రాష్ట్రస్థాయిలోనూ ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఒడిశా సాహిత్య అకాడమీ 68వ స్వర్ణజయంతి వేడుకల (జూలై 25) సందర్భంగా భువనేశ్వర్‌లోని రవీంద్ర మండపంలో ఏర్పాటుచేసిన సభలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ చేతులమీదుగా జాస్మిన్ బోరాడోకు బహుమతి ప్రదానం చేశారు.



రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ చేతులమీదుగా బహుమతి అందుకుంటున్న పర్లాకిమిడి విద్యార్థిని జాస్మిన్ బోరాదో

ఉచిత నేత్ర వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ హృషి కేస్ రథ్

రాయగడ: స్థానిక కళింగ వైశ్య సంఘం, హింజిలికట్‌లోని శంకర్ నేత్ర వైద్యశాల సంయుక్తంగా శుక్రవారం స్థానిక కళింగ వైశ్య సంఘం కార్యాలయం ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన 85 మందికి వైద్యం అందించారు. శంకర్ ఐ ఆస్పత్రికి చెందిన వైద్య నిపుణులు డాక్టర్ హృషి కేష్ రథ్, క్యాంప్ మేనేజరు నళిని కాంత్ రౌత్, సిబ్బంది శుభశ్రీ తదితరుల నేతృత్వంలో నిర్వహించిన శిబిరంలో 13 మందికి నేత్ర పరీక్షలు చేసి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. వీరిని శంకర్ హస్పటల్‌కు చెందిన యాజమాన్యం ఖర్చులతో వారికి ఉచితంగా ఆపరేషన్లను నిర్వహిస్తారని శిబిరం నిర్వాహకులు కళింగ వైశ్యసంఘం అధ్యక్షులు కింతలి అమర్ నాథ్, కార్యదర్శి టంకాల జయరాం, సహకార్యదర్శి చిన్నారి విజయ్ మోహన్ తెలిపారు. కళింగ వైశ్య సంఘం వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఇటువంటి తరహా ప్రజాహిత కార్యక్రమాలు భవిష్యత్‌లో మరిన్ని నిర్వహించేందుకు సన్నహాలు చేస్తున్నామని అధ్యక్షులు అమర్ నాథ్ తెలిపారు.

మౌలిక వసతులపై దృష్టి పెట్టండి: కలెక్టర్



డార్మిటరీ పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బూర్జ: విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంపై దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మండలంలో గల కొల్లివలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యాలయంలో శుక్రవారం జిల్లాలోగల అన్ని హాస్టళ్ల అనుబంధ శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీరు, వసతులు, డార్మిటరీ గురించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కిటికీల వద్ద దోమ తెరలు అమర్చాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శాఖల వారీగా హాస్టల్ జిల్లా అధికారుల తో సమీక్ష నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాలయాల ఎస్ఎం పురం, వమ్మరవెల్లి కళాశాల ప్రిన్సిపాల్స్, కేజీబీవీ విద్యాలయాల ఏపీసీ ఎస్.శశిభూషణరావు, ఏపీ మోడ ల్ విద్యాలయాలు ఏడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఓ కె.విజయకుమారి, కన్వీనర్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో ఐటీఐ పాసైన విద్యార్థులకు ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి జిల్లా ప్రజారవాణా అధికారి హనుమంతు అమరసింహుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి ఆగస్టు నెల 9వ తేదీ లోపు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

అథ్లెటిక్స్ సమరానికి వేళాయె

- రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు
- ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాష్ట్రపోటీలకు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అథ్లెటిక్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఈనెల 27వ తేదీన జరగను న్నాయి. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానం వేదికగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపిక ల ప్రక్రియ మొదలుకానుంది. అథ్లెటిక్స్ అసో సియేషన్ రాష్ట్ర, జిల్లా చైర్మన్ కొన్న వెంకటేశ్వ రావు(వాసు) సూచనల మేరకు జిల్లా అథ్లెటి క్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి నేతృత్వంలో జిల్లా సంఘ ప్రతినిధులు, పీడీ, పీఈటీలు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు.



నాలుగు వయో విభాగాల్లో పోరు..

సౌత్‌జోన్ నేషనల్స్‌లో పాల్గొనే అథ్లెటిక్స్ క్రీడా కారుల ఎంపికలు మొత్తం నాలుగు వయో విభాగాల్లో చేపట్టనున్నారు. అండర్–14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా 100 మీటర్ల పరుగుపందాలు, హర్డిల్స్, 200 400, 800, 1000, 2వేలు, 3వేలు, 5వేల మీటర్ల పరుగు పందాలు, నడక, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, హేమర్‌త్రో, పోల్‌వాల్ట్ తదితర అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో పోటీలు నిర్వహించి అందులో రాణించిన క్రీడాకారులను రాష్ట్రపోటీలకు ఎంపిక చేయనున్నారు.

ఇక్కడ రాణిస్తే రాష్ట్ర పోటీలకు..

ఏపీ జూనియర్ స్టేట్‌మీట్(అంతర్‌జిల్లాల) అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025 పోటీలు బాపట్ల జిల్లా (చీరాల) వేదికగా ఆగస్టు 9 నుంచి 11వ తేదీ వరకు జరగనున్నాయి. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా ఇక్కడ జరిగే ఎంపికల్లో రాణించిన అథ్లెట్లను బాపట్లలో జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపిక చేయనున్నారు. అక్కడ మూడు రోజులపాటు పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేస్తారు. గోల్డ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులు సౌత్‌జోన్ నేషనల్స్‌కు నేరుగా అర్హత సాధించనున్నారు. పుదుచ్చేరి వేదికగా సెప్టెంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు సౌత్‌జోన్ జూనియర్ నేషనల్స్ జరగనున్నాయి. క్రీడాకారులు వివరాల కోసం సంఘ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కె.మాధవరావు (9346903771)ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి



సౌత్‌జోన్ మీట్ షెడ్యూల్ వెలువడింది. 27న శ్రీకాకుళంలో జరిగే జిల్లాస్థాయి ఎంపికల్లో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తమ ప్రతిభను నిరూపించుకోవాలి.

– కొన్న మధుసూదనరావు, అథ్లెటిక్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు

ప్రతిభే ఆధారంగా..



క్రీడాకారుల ప్రతిభే ఆధారంగా ఎంపికలను నిర్వహిస్తాం. ఇక్కడ రాణించిన బాలబాలికలను బాపట్లలో జరిగే స్టేట్‌మీట్‌కు ఎంపిక చేస్తాం. అక్కడ రాణిస్తే సౌత్‌జోన్ నేషనల్స్‌కు నేరుగా అర్హత సాధిస్తారు.

– మెంటాడ సాంబమూర్తి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

హిరాకుద్ జలాశయానికి వరదపోటు



హిరాకుద్ జలాశయం వద్ద నీటి ఉధృతి

భువనేశ్వర్: హిరాకుద్ జలాశయంలో వరద నీటి ఉధృతి పెరుగుతుంది. ఈ జలాశయం గరిష్ట నీటి మట్టం పరిమితి 630 అడుగులు కాగా ప్రస్తుతం 609.39 అడుగుల నీటి మట్టం కొనసాగుతుంది. నీటి మట్టం నియంత్రణలో భాగంగా అంచెలంచెలుగా వరద నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం ఎడమ వైపు 13, కుడి వైపు ఏడు.. మొత్తం మీద 20 గేట్లు తెరిచి వరద నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం లోనికి ప్రతి సెకన్‌కు 2.51 లక్షల క్యూసెక్కులు ప్రవహిస్తుండగా సెకనుకు 2.75 లక్షల క్యూసెక్కులు వరద నీరు విడుదల చేస్తున్నారు. వరద ఉధృతి దృష్ట్యా మిగిలిన గేట్లు తెరిచే విషయం ఖరారు చేస్తారని జల వనరుల శాఖ చీఫ్ ఇంజినీర్ తెలిపారు. గురువారం నుంచి పలు చోట్ల ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. 15 జిల్లాల 43 మండలాల్లో 50 మిల్లీమీటర్లు పైబడి వర్షపాతం నమోదు అయినట్లు విభాగం సమాచారం. ఇదే పరిస్థితి కొనసాగితే నదుల్లో నీటి మట్టం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం అన్ని నదుల నీటి మట్టం ప్రమాద సంకేతం దిగువన కొనసాగుతుందని సమాచారం.

క్లుప్తంగా

లింగ నిర్ధారణ వెల్లడిస్తే చర్యలు

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: లింగ నిర్ధారణ వెల్లడించే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గర్భస్థ, పిండ ప్రక్రియ 1994 అమలుపై నియమించిన జిల్లా స్థాయి, ఉప జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోగ్రాం అధికారులు వారి పరిధిలో ఉన్న స్కానింగ్ సెంటర్స్‌ను పరిశీలించాలని ఆదేశించారు. ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ రెడ్డి అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ ఆధ్వర్యంలో 'పోలీస్ వెల్ఫేర్ డే'



తన చాంబర్‌లో సిబ్బంది వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'పోలీసు వెల్ఫేర్ డే'ను నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి విజ్ఞాపనలు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. 'పోలీసు వెల్ఫేర్ డే'లో భాగంగా సిబ్బంది ఒక్కొక్కరిని ఎస్పీ వకుల్ జిందల్ తన చాంబర్‌లోకి పిలిపించుకుని వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకుని, వారి నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను ఎస్పీ స్వయంగా పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట సమీపంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని మతిస్థిమితంలేని వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటనను చూసిన పోలీసులు 108కు సమాచారం అందించడంతో ఈఎంటీ మీసాల ఈశ్వరరావు, పైలెట్ గంగు జగన్నాథరావులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలపాలైన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించారు. పూర్తిగా బురద, రక్తంతో తడిచిపోయిన క్షతగాత్రుడిని పోలీసుల సహాయంతో శుభ్రం చేయడంతో పాటు కొత్త దుస్తులు వేసి రాజాం సామాజిక ఆస్పత్రికి మెరుగైన చికిత్సనిమిత్తం తరలించారు. మానవత్వంతో 108 సిబ్బంది అందించిన సేవలను పలువురు అభినందించారు.

జిల్లాకేంద్రంలో కార్డన్ సెర్చ్

పార్వతీపురం రూరల్: అక్రమరవాణా నియంత్రణే లక్ష్యంగా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు నేర నియంత్రణ, గంజాయి, సారా, మద్యం అక్రమ రవాణా, నిల్వలు గుర్తించేందుకు, అనుమానిత వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసేందుకు శుక్రవారం ఉదయం పార్వతీపురంలో ''కార్డన్ సెర్చ్'' ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్ నిర్వహణకు సంబంధించి ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలతో సహా, 40మంది పోలీసు సిబ్బంది, వీఆర్‌ఓల సమన్వయంతో పార్వతీపురం పట్టణంలో గల ఇందిరా కాలనీలో 170 ఇళ్లలో సోదాలు నిర్వహించారు. నేర చరిత్ర కలిగిన పాత నేరస్తులపై నిఘా ఉంచి వారి జీవన విధానం, నడవడికపై ఆరా తీసి, వారి ఇళ్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారి వద్ద లభించిన వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గంజాయి, మద్యం, సారా అక్రమ నిల్వలపై సోదాలు చేసి కొత్త, అనుమానిత వ్యక్తులపై ఆరా తీసి నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు సోదాలు నిర్వహించారు. అదేవిధంగా జియ్యమ్మవలస మండలం బొడ్డవలస గ్రామంలో కూడా ఎస్సై ప్రశాంత్, సిబ్బందితో 'కార్డన్ సెర్చ్' ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో పార్వతీపురం పట్టణ సీఐ మురళీధర్, రూరల్ సీఐ గోవిందరావు, సీతానగరం ఎస్సై రాజేష్, టౌన్ ఎస్సైలు జగదీష్ నాయుడు, గోవింద్, రూరల్ ఎస్సై సంతోషి, సిబ్బంది, స్పెషల్ పార్టీ, సీసీఎస్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు

విజయనగరం అర్బన్: రానున్న 24 గంటల్లో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, మత్స్యకారులు వేటకు వెళ్లకుండా సూచనలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయిలోనే ఉండి పరిస్థితుల్ని అంచనా వేయాలని, ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలన్నారు. జలాశయాల్లో నీటినిల్వలపై కలెక్టరేట్ డి-సెక్షన్‌కు నివేదికలు అందజేయాలని జలవనరులశాఖ అధికారులకు సూచించారు.

గుర్రుమీదున్న గురువులు

● ఐఆర్, పీఆర్సీ పెండింగ్ డీఏలపై నోరుమెదపని సర్కారు
● ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులైజేషన్ గాలికి
● సమస్యలపై ఉద్యమానికి సిద్ధమవుతున్న ఉద్యోగులు
● నేడు కలెక్టరేట్ వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా



రామభద్రపురం చొక్కాపు వీధి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

రామభద్రపురం: చంద్రబాబుతో జతకట్టిన పవన్ కల్యాణ్ సైతం సార్వత్రిక ఎన్నికల సమయంలో అన్ని వర్గాల ప్రజలకు హామీల వర్షం కురిపించారు.ఆ వర్షంలో తడిసి ముద్దయిన వారిలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులూ ఉన్నారు. మాకు అధికారం ఇచ్చి చూడండి. ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్సీ ఇస్తాం. పెండింగ్ బకాయిలన్నింటినీ ఒకేసారి చెల్లిస్తాం, సకాలంలో జీతాలు, పెన్షన్లు, ఇతర ఆర్థిక ప్రయోజనాలను అందించే ఏర్పాట్లు చేస్తాం. ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల కోసం రాజకీయ నాయకుల చట్టూ తిరిగే పని లేకుండా చేస్తాం. ఉద్యోగుల పని భారం తగ్గిస్తాం అంటూ ఇలా ఎన్నో అలవిగాని హామీలతో చంద్రబాబు ఉద్యోగులకు ఒక బహిరంగ లేఖ కూడా రాశారు.అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంతవరకూ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. దీంతో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు కూటమి సర్కారుపై కోపంగా ఉన్నారు. తమకు ఇచ్చిన హామీలను నేరవేర్చకపోతే ఉద్యమాలకు సిద్ధం అంటూ కూటమి సర్కారుకు హెచ్చరికలు జారీచేస్తున్నారు.

ఇంకెన్నాళ్లు ఎదురు చూపు..

రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం జరిగిన ప్రతిసారి తమ సమస్యలపై ఏమైనా చర్చిస్తారేమోనని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఏడాదిగా ఎంతో ఆశతో ఎదురుచూస్తూ వస్తున్నారు.ఈ 24వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో కూడా కనీసం ఆ ఊసేఎత్తలేదు. ఇప్పటికే ఉద్యోగులకు మూడు డీఏలు పెండింగ్‌లో ఉండగా జూలైతో ఆ సంఖ్య నాలుగుకు చేరింది.అధికారంలోకి రాగానే ఐఆర్ ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అదీ లేదు. పీఆర్సీ కమిషన్ రాజీనామా చేస్తే ఆ స్థానంలో ఇప్పటి వరకూ కొత్త కమిషన్‌ను నియమించలేదు. కొత్త పీఆర్సీ వస్తే జీతాలు పెంచాల్సి వస్తుందని సాగదీస్తున్నారని ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి.

ఓపీఎస్‌పై నోరుమెదపని సర్కారు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో తీసుకొచ్చిన గ్యారంటీ పెన్షన్ స్కీమ్‌ను తీసేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ను తీసుకొస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు ఉద్యోగులకు మాటిచ్చారు. ఏడాది కాలంలో ఏనాడూ ఈ అంశంపై నోరు మెదపలేదు. ఈ విషయంలోనూ కూటమి సర్కారు ఉద్యోగులకు వెన్నుపోటు పొడించింది. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఉద్యోగులకు 27 శాతం ఐఆర్ మంజూరు చేసిన విషయాన్ని పలు ఉద్యోగ సంఘాల నాయకులు గుర్తుచేసుకుంటున్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ లేనట్లేనా?

తాము అధికారంలోకి రాగానే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణతో పాటు మినిమం టైమ్ స్కేల్ ఇచ్చే బాధ్యత తీసుకుంటాం. మాటలు చెప్పే వాళ్లం కాదు. చేసి చూపిం చేవారిమని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 12 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని అంచనా. వారిలో 15 ఏళ్లకు పైబడి విధులు నిర్వర్తిస్తున్న వారు కూడా ఉన్నారు.అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది కాలంలో ఏనాడూ కూటమి ప్రభుత్వం వారికిచ్చిన హామీపై చర్చించిన దాఖలాలు లేవు. దీనికి భిన్నంగా జనవరి 6న జీవో నంబర్-2 ప్రకారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంలో ప్రభుత్వ పథకాల్లో ఉండే ఉద్యోగులకు కూడా మినిమం టైమ్ స్కేల్ ఇవ్వడం జరగదని నిర్ణయం తీసుకుని కూటమి ప్రభుత్వం మోసం చేసిందని ఆయా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వీరు కూడా ఆందోళన బాట పట్టాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం.



ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఎంఈవో 1,2 తిరుమలప్రసాద్, పెంటయ్యలకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాలు (ఫైల్)

ఉద్యమ బాట తప్పదు..



ఏటా జనవరి, జూలై మాసాల్లో ప్రతి ఆరు నెలలకోసారి కేంద్ర ప్రభుత్వం కరువు భత్యం ప్రకటిస్తోంది. దానిని అనుసరించి రాష్ట్రం డీఏలు ఇవ్వాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం ఒక్క డీఏ కూడా ఇవ్వలేదు. ఈ జూలై మాసంతో పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే ఇవ్వకపోతే ఉద్యమబాట పట్టాల్సి వస్తుంది. యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యలపై శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నాం.

ప్రసన్నకుమార్,
యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు

గిరిజనులకు అన్యాయం చేస్తే సహించం

● ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న గిరిజనులు, నాయకులు



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బొబ్బిలి: నియోజకవర్గంలోని రామభద్రపురం మండలం కాకర్ల వలస, కారేడువలస గ్రామాల గిరిజనుల సాగు భూములు లాక్కుని ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తే సహించబోమని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తదితరులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మువ్వల శ్రీనివాసరావు మాట్లాడుతూ కొట్టక్కి రెవెన్యూ పరిధిలో ఏపీఐఐసీ ఏర్పాటు చేస్తున్న ఎంఎస్‌ఎంఈ పార్కు బాధితులకు మద్దతుగా ఉంటామన్నారు. కారేడు వలస, కాకర్ల వలస గ్రామాల్లో నివాసముంటున్న గిరిజనులు ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వం ఇచ్చిన భూమిని సాగు చేస్తున్నారని ఆ భూముల ఆధారంగా జీవనం పొందుతున్న గిరిజనుల నుంచి ప్రభుత్వం అన్యాయంగా భూమిని లాక్కోవడం సరికాదన్నారు. కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా భూమిని లాక్కోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. గిరిజనులు వేసుకున్న మామిడి, జీడి మొక్కలను, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేయడం పద్ధతేనా అని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి జీవనోపాధి పొందుతున్న భూమికి పరిహారం ఇవ్వకుండా ఎంఎస్‌ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఖాళీగా ఉన్న భూముల జోలికి వెళ్లకుండా వాటి పక్కనే ఉన్న గిరిజనులకు చెందిన భూములను తీసుకుంటామనడం ఎంత వరకూ సబబని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది అత్యంత దుర్మార్గమన్నారు.

ధ్వంసం చేసిన పంటకు పరిహారం ఇవ్వాలి

గిరిజనుల భూములను వెంటనే వారికి వదిలేసి, ధ్వంసం చేసిన పంటలకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భూములను తీసుకుని వాటికి ప్రత్యామ్నాయంగా వేరే చోట భూములు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ జేవీఎస్ఎస్ రామమోహన రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు, సీపీఎం రామభద్రపురం మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, గిరిజనులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లోగా ఇళ్లనిర్మాణం పూర్తిచేయాలి



హౌసింగ్ డీఈ రంగారావుతో మాట్లాడుతున్న ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ (అడ్మిన్) వెంకటరమణ

విజయనగరం టౌన్: ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను సగంలో ఆపేసిన వారంతా డిసెంబర్ నెల లోగా పూర్తిచేయాలని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ (అడ్మిన్), విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాల ప్రత్యేకాధికారి వెంకటరమణ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం గుంకలాం జగనన్న లేఅవుట్‌ను ఆయన డీఈ రంగారావుతో కలిసి సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో త్వరితగతిన రూఫ్‌కాస్ట్ నిర్మాణాలు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో మొత్తం 2091 ఇళ్లు రూఫ్ లెవల్స్ వరకూ వచ్చాయని, నాలుగు వారాల్లో వాటిని పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశామన్నారు. వాటిలో సుమారు 1161 మంది లబ్ధిదారులకు అదనపు బెనిఫిట్స్ అందజేశామని తెలిపారు. బీసీలకు రూ.50వేలు, ఎస్సీలకు రూ.75వేలు, ప్రిమిటివ్ ట్రయ్ గ్రూప్స్‌కు రూ.లక్ష అందజేశామని చెప్పారు. మిగతా వారెవరికైనా డబ్బులు రాలేదని ముందుకువస్తే హౌసింగ్ అధికారులతో కలిసి వారికి సాయమందిస్తామని చెప్పారు. 1500 వరకూ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయడం టార్గెట్‌గా ఉంచామని, లబ్ధి డిసెంబరు నెలాఖరువరకే ఉందన్నారు. డిసెంబరు లోపు ఇళ్లు కట్టకపోతే సెంట్రల్ గవర్నమెంట్ నుంచి వచ్చే డబ్బులు అందవన్నారు. ప్రస్తుతం చిన్న చిన్న కాంట్రాక్టర్‌లు కట్టిస్తున్న ఇళ్లపై ఆన్‌లైన్ వర్క్ చేసేందుకు ఎమినిటీస్ ఇక్కడికి రావడం లేదని. కచ్చితంగా వారు కనీసం వారానికి రెండుసార్లు అయినా వచ్చి ఇళ్ల నిర్మాణాలపై దృష్టిపెట్టాలని సూచించారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనక్ అవార్డు కోసం నామినేషన్ల ప్రక్రియ



జిల్లా విద్యా శాఖ అధికారి బి.రాజ్ కుమార్

పార్వతీపురం టౌన్: 2025-26 విద్యాసంవత్సరానికి ఇన్‌స్పైర్ మనక్ అవార్డు కోసం ప్రాజెక్ట్‌ల నామినేషన్ ప్రక్రియ ఆన్‌లైన్‌లో మొదలైందని పార్వతీపురం మన్యం జిల్లా విద్యా శాఖ అధికారి బి.రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 15 వ తేదీలోగా అన్ని పాఠశాలల నుంచి ప్రాజెక్టు సబ్‌మిట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులను ఆదేశించామన్నారు. ప్రతి మండల పరిధిలో ఉండే అన్ని పాఠశాలల నుంచి పూర్తిస్థాయిలో పరిశీలన చేసి జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో ప్రాజెక్టులు నామినేట్ అయ్యే విధంగా చూడాలని మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 6-12 తరగతులకు ఇన్‌స్పైర్ మనక్‌లో అవకాశం కల్పించారని తెలిపారు. ప్రతి ఉన్నత పాఠశాల నుంచి 5 ప్రాజెక్ట్స్ హైస్కూల్ ప్లస్ నుంచి 7 ప్రాజెక్ట్స్ httpr://www.inspireawards&drt.gov.in అనే లింక్ ఓపెన్ చేసి ప్రాజెక్టు సబ్‌మిట్ చేయాలని సూచించారు. ప్రాజెక్ట్ సబ్మిషన్, ఇతర సాంకేతిక సహకారానికి జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు ఫోన్ నంబర్ 8978077156ను సంప్రదించవచ్చని కోరారు.

రామతీర్థానికి శ్రావణ శోభ

● ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు



చందనం అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



విశేష అలంకరణలో కామాక్షి అమ్మవారు



సహస్ర దీపాలంకరణ సేవలో అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానానికి శ్రావణమాస శోభ సంతరించుకుంది. శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారితో పాటు ఉమా సదాశివాలయంలో ఉన్న కామాక్షి అమ్మవారికి అర్చకులు విశేష పూజలు జరిపించారు. మహాలక్ష్మి అమ్మవారిని చందనంతోను, కామాక్షి అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. తొలి శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ వై శ్రీనివాసరావు, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా పూర్ణాహుతి

రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పూర్ణాహుతి హోమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం వైభవంగా జరిపించారు. వేకువజామున స్వామిని ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన అనంతరం యాగశాలలో పూర్ణాహుతి చేపట్టారు. తరువాత వెండి మంటపంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామి సన్నిధిలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమం కనుల పండువగా జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

సీతానగరం: మండలంలోని తామరఖండి గ్రామ శివారులో శుక్రవారం పేకాటాడుతున్న స్థావరాలపై సిబ్బంది సహ కారంతో దాడులు చేశామని ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు. ఈ మేరకు తామరఖండి గ్రామం శివారులో పేకాట ఆడుతూ ఆరుగురు వ్యక్తులు పట్టుబడగా వారి దగ్గర రూ.17,300లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

లక్కవరపుకోట: మండలంలోని రొంగలివానిపాలెం గ్రామానికి చెందిన సీహెచ్ కార్తీక్ 10 రోజుల క్రితం బాలికను వంచించి వశపర్చుకున్న నేపథ్యంలో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసును ఎస్‌ఐ నవీన్‌పడాల్ నమోదు చేశారు. కాగా విచారణలో భాగంగా శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ సబ్ స్టేషన్ వాచ్‌మన్ అదృశ్యం



అదృశ్యమైన వాచ్‌మన్ రమణయ్య

విజయనగరం క్రైమ్: దాసన్నపేట విద్యుత్ సబ్ స్టేషన్ లో వాచ్ మేన్‌గా పని చేస్తున్న కె.రమణయ్య కనిపించడం లేదని ఆయన భార్య సత్యవతి శుక్రవారం చేసిన ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై కనకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కొన్నాళ్లుగా తాగుడుకు బానిసైన రమణయ్య జీతం వచ్చినప్పుడు ఇంట్లో కాస్త ఇచ్చి ఊరెళ్తున్నానని భార్యకు చెప్పేవాడు. అయితే గడిచిన నాలుగు నెలల నుంచి భర్త ఇంటికి రాకపోవడంతో స్థానికులు, బంధువుల ఇళ్లకు వెళ్లి భార్య సంప్రదించింది. ఏపీ ట్రాన్స్ కో సిబ్బంది కూడా వాచ్‌మన్ రమణయ్య గురించి వాకబు చేసి..డ్యూటీకి రావడం లేదని భార్యకు చెప్పారు. దీంతో ఆమె తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై కనకరాజు వివరించారు.

పాత పట్టాదారు పాస్‌పుస్తకాలు రద్దు

● ఆగస్టు 15న కొత్త పుస్తకాల పంపిణీ



మాట్లాడుతున్న ఆర్డీవో దాట్ల కీర్తి

విజయనగరం అర్బన్: వైఎస్ఆర్‌సీపీ హయాంలో రీసర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో భూ రికార్డులకు పంపిణీ చేసిన పట్టాదారుల పాస్ పుస్తకాలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్తగా రూపొందించిన పుస్తకాలు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో రెండు విడతల్లో దాదాపు 360 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి పట్టాదారు పాస్ పుస్తకాలను కూడా పలు గ్రామాల్లో పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల ముందు రీసర్వే ప్రక్రియపై ప్రజల్లో తీవ్రస్థాయిలో అపోహలు కల్పించిన కూటమి ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వే విధానాన్నే అవలంబిస్తున్న విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఇప్పటికే పూర్తయిన రీసర్వే గ్రామాల్లో కాలయాపన చేయడం కోసం మరోసారి రీసర్వే చేపట్టింది. గత ప్రభుత్వం పూర్తి చేసిన రీసర్వేలను సరిచూసుకోవడం మినహా కొత్త గ్రామాల రీసర్వే మూడో విడత పనులు జరగలేదు.

ఆగస్టు 15న పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

భూ హక్కుదారులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం కొత్తగా రూపొందించిందని, ఇటీవల సవరించిన రీసర్వే పనులు పూర్తయిన అన్ని గ్రామాలకు సంబంధించి భూహక్కు పట్టాదారు పాస్ పుస్తకాలు జిల్లాకు వస్తున్నాయని విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ తొలి విడతగా విజయనగరం డివిజన్ పరిధిలోని 39 గ్రామలకు చెందిన భూహక్కుదారులకు వచ్చే నెల 15న పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నామని, వాటికి సంబంధించి ఇప్పటికే రీసర్వే సవరణ ప్రక్రియ పూర్తయిందని, వెబ్‌ల్యాండ్‌లో సమాచారం ఆధారంగా సరిపోయిన వారికి పుస్తకాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. విజయనగరం డివిజన్ పరిధిలో ఇళ్ల పథకం కింద 11 వేల మంది దరఖాస్తు చేసుకోగా వాటిని 30 రోజుల్లో పరిశీలన పూర్తి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన పట్టాలపై మరో సారి సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా సొంత ఇంటి స్థలం లేనివారు, లబ్ధిదారు కుటుంబంలో ఏ ఒక్కరూ గతంలో ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల ద్వారా లబ్ధిపొందని మహిళలు అర్హులవుతారన్నారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న గృహాల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన 175 దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

● సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ



సభా ప్రాంగణం వద్ద సీపీఐ జిల్లా కార్యవర్గం

బొబ్బిలి: సీపీఐ 14వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మిరమణ కోరారు. శనివారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న మహాసభల సభా ప్రాంగణం ఏర్పాట్లను ఆయన కార్యవర్గంతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వర రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జల ఈశ్వరయ్యలు హాజరవుతారన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాసరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించాలి

● పోలీస్ అధికారులతో ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్



జూమ్ కాన్ఫరెన్స్‌లో ఎస్‌హెచ్‌ఓలతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: కేసుల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించాలని, అలాగే స్కూల్స్, కాలేజీల్లో శక్తి వారియర్ టీమ్స్ ను నియమించాలని డీఎస్పీలతో పాటు అన్ని స్టేషన్ల హౌస్ ఆఫీసర్స్‌ను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి శుక్రవారం ఆయన జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా అడ్మిన్ ఏఎస్పీ సౌమ్యలతతో కలిసి పోలీస్ అధికారులతో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. శక్తి టీమ్స్ పనితీరు, రిపీటెడ్ నిందితులు, మహిళల అదృశ్యం, గంజాయి కేసులు, ఫైనాన్షియల్ దర్యాప్తు, నాన్ బెయిలబుల్ వారంట్ల ఎగ్జిక్యూషన్‌ను సమీక్షించారు.అలాగే పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులు, సాంకేతికత వినియోగం గురించి దిశా నిర్దేశం చేశారు. ఇప్పటికే హిస్టరీ షీట్లు కలిగిన నిందితులపై గత కేసుల ప్రస్తుత స్థితి, కోర్టు విచారణలో ఉన్న కేసుల్లో ప్రాసిక్యూషన్ జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని సూచించారు.

కేసుల మిస్టరీని ఛేదించాలి

ఇక నాన్ బెయిలబుల్ వారంట్లు, పోయిన వాహనాలు, మిస్సింగ్ వ్యక్తులను గుర్తించేందుకు, సైబర్ క్రైం, గంజాయి కేసుల్లో లభించిన చిన్న చిన్న ఆధారాలతో సాంకేతికతను వినియోగించి కేసుల మిస్టరీని ఛేదించాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఏడేళ్లకు పైబడి శిక్షలు విధించిన అన్ని కేసుల్లో రికార్డు చేసిన వీడియోలు, ఫొటోలను ఈ సాక్ష్య యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఈ సాక్ష్య యాప్‌ను ప్రతి దర్యాప్తు అధికారి వినియోగించాలని ఆదేశించారు. నాన్ బెయిలబుల్ వారంట్లను ఎగ్జిక్యూట్ చెయ్యాలని, పరారీలో ఉన్న ఎన్బీడబ్ల్యు వ్యక్తులకు ష్యూరిటీగా నిలిచిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

శివారు ప్రాంతాలపై నిఘా

అసాంఘిక కార్యకలాపాలు జరిగేందుకు అవకాశం ఉన్న పాత బిల్డింగులు, శివారు ప్రాంతాలను గుర్తించి నిఘా పెట్టాలని ఆయా ప్రాంతాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, సంబంధిత లయన్స్ డిపార్ట్‌మెంట్ అధికారులతో మాట్లాడి లైటింగ్ ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జూమ్ మీటింగులో డీఎస్పీలు ఎం.శ్రీనివాసరావు, జి.భవ్యారెడ్డి, ఎం.వీరకుమార్, ఆర్.గోవిందరావు, ఎస్పీ సీఐ ఏవీ లీలారావు, డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై ప్రభావతి, పలువురు సీఐలు, ఎస్సైలు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాగెంపేటలో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై నీలావతి, క్లూస్ టీమ్ సభ్యులు

వంగర: మండల పరిధిలోని బాగెంపేట గ్రామానికి చెందిన పశుమర్తి శంకరరావు ఇంట్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. శంకరరావు కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. ఈ విషయం గమనించిన దొంగలు అర్ధరాత్రి ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాను తెరిచారు. ఈ విషయం శుక్రవారం ఉదయం గమనించిన చుక్కపక్కల వారు ఇంటి యజమానితో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జి ఎస్సై పి.నీలావతి, క్లూస్‌టీం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

క్లూస్‌టీం బృందం పలుచోట్ల వేలిముద్రలు సేకరించింది. ఈ విషయంపై వంగర పోలీసులను సంప్రదించగా హైదరాబాద్ నుంచి ఇంటి యజమాని ఫ్లైట్‌లో వస్తున్నాడని, ఆయనను ఫోన్‌లో సంప్రదించగా సుమారు 20తులాల బంగారం పోయినట్లు తెలిపాడన్నారు. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు వచ్చి పరిశీలించిన తరువాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు చేస్తామని ఎస్సై తెలిపారు.